క్లుప్తంగా

దరఖాస్తులు చేసుకోండి

పెంట్లవెల్లి: మండలంలోని పలు గ్రామాల రైతులు ఆయిల్‌ఫాం చెట్ల పెంపకం కోసం వ్యవసాయ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని అధికారి లక్ష్మణ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయిల్‌ఫాం సాగు చేసేందుకు ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం సబ్సిడీ అందుతుందని పేర్కొన్నారు. రైతుల పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు తీసుకొని వ్యవసాయ కార్యాలయంలో అధికారులను సంప్రదించాలని కోరారు.

ఆలయ గోపురానికి పూజలు



కల్వకుర్తిరూరల్: మండలంలోని మల్లికార్జున స్వామి దేవస్థాన గాలిగోపురం నిర్మాణం ఆదివారం పూర్తి కావడంతో ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్వరలోనే విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు యాదయ్య తెలిపారు. కార్యక్రమంలో కృష్ణయ్య, లక్ష్మయ్య, గంగయ్య, మల్లయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి చేయూత



చారకొండ: మండల కేంద్రానికి చెందిన రాగిపని శ్రీనివాసులు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న 1994–95 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు డబ్బులను పోగు చేసుకున్నారు. ఆదివారం మిత్రుడిని పరామర్శించి రూ. 50 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రవి, బాల్‌రాం గౌడ్, శ్రీను, శంకర్ గౌడ్, ఆనంద్, స్కైలాబ్, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. చెర్కూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గౌడుగు చంద్రయ్య ఆత్మహత్య పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న సీడ బ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి ఆయా గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం చంద్రయ్య భార్య అలివేలుకు రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు పర్వత్ రెడ్డి, శేఖర్, రాహుల్, ఎర్రశ్రీను, శ్రీకాంత్‌రెడ్డి, రామచంద్రయ్య, వెంకట్‌రెడ్డి, కృష్ణముదిరాజ్, పుల్లయ్య, రమేష్, జగన్, ఉన్నారు.

10న లీగల్ లిటరసీ క్యాంపు

పెద్దకొత్తపల్లి: గ్రామ పంచాయతీ ఆవరణలో ఈ నెల 10న మండల లీగల్ సర్వీసెస్ కమిటీ కొల్లాపూర్ ఆధ్వర్యంలో లీగల్ లిటరసీ క్యాంపు నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ హరికృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

లింగాల: మండలంలోని అప్పాయపల్లిలో ఆదివారం పెద్దల సమక్షంలో నిర్వహిస్తున్న పంచాయితీలో రామచంద్రంపై పర్వతాలు దాడి చేశాడు. ఎస్‌ఐ జగన్‌మోహన్ వివరాల ప్రకారం ఇరువురి మధ్య కొన్ని నెలల నుంచి ప్లాట్, నీటి సంపు విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయమై పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించగా ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. రామచంద్రంపై పర్వతాలు దాడి చేసి గాయపర్చాడు. బాధిత వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చారకొండ: డిండి వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు మండలంలోని జూపల్లి పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇన్‌చార్జ్‌ల పాలన ఇంకెన్నాళ్లు?

- ముందుకు సాగని అభివృద్ధి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



రెగ్యులర్ లైబ్రేరియన్ లేని గ్రంథాలయం



మండల వనరుల కేంద్రం

లింగాల: మండలంలోని పలు శాఖలకు రెగ్యులర్ అధికారులు లేకపోవడం ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకొస్తున్నారు. కొన్నేళ్లుగా ఇన్‌చార్జ్‌లే విధులు నిర్వహిస్తున్నారు. విద్యాశాఖకు సంబంధించి ఎంఈఓ లేకపోవడంతో విద్యా సంబంధమైన సమస్యలు సకాలంలో పరిష్కారం కావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఎంఈఓకు మరో నాలుగు మండలాల అదనపు బాధ్యతలను అప్పగించారు. దీంతో సమస్యలు పరిష్కరించేందుకు అవకాశం లేకుండా పోయింది. అధికారులు న్యాయం చేయలేకపోతున్నారు. పాఠశాలల తనిఖీలు, తరచుగా నిర్వహించే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలలో ఎంఈఓ పాల్గొనాల్సి ఉన్నా హాజరుకాలేకపోతున్నారు. బడిబాట కార్యక్రమాన్ని పర్యవేక్షించే అధికారి లేక పోవడం, మండలంలో విద్యాశాఖ పనితీరు అస్తవ్యస్తంగా మారింది. విద్యా సంబంధమైన సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

పశుసంవర్ధక శాఖలో..

పశు వైద్యశాలలో ఏళ్ల తరబడి డాక్టర్ పోస్టు ఖాళీగా ఉండడంలో బల్మూర్ మండలానికి చెందిన పశువైద్యాధికారిని మండలానికి ఇన్‌చార్జ్ అధికారిగా బాధ్యతలు అప్పగించారు. మండల కేంద్రంతో పాటు అంబట్‌పల్లిలో ఉన్న పశువైద్యశాలల్లో కొన్నేళ్ల నుంచి పశువైద్యాధికారులు లేకపోవడం ఇన్‌చార్జ్‌లతోనే నెట్టుకురావాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆయా పశువైద్య శాలలో కింది స్థాయి సిబ్బంది వైద్యం చేస్తున్నారు. మండలంలోని గ్రామాలలో సంచార పశువైద్యం కూడా చేపట్టక పోవడంతో మూగ జీవాలకు సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి.

గ్రంథాలయంలో..

మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయానికి రెగ్యులర్ లైబ్రేరియన్ లేక పోవడం ఇన్‌చార్జ్‌ని కేటాయించినా విధులకు సక్రమంగా రావడం లేదు. అటెండరే గ్రంథాలయాన్ని నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. గ్రంథాలయంలో పాత పుస్తకాలనే పాఠకులు తిరిగేయాల్సి వస్తుంది. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు సరఫరా కాక పోవడంతో నిరుద్యోగులు తీవ్రంగా నష్ట పోతున్నారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహానికి రెగ్యులర్ హెచ్‌డబ్ల్యూఓ లేక పోవడం, బల్మూర్ హెచ్‌డబ్ల్యూఓకు ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వగా వసతి గృహం నిర్వహణ వర్కర్లపై ఆధారపడింది. పాలకులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పందించి ఇన్‌చార్జ్ లను తొలగించి రెగ్యులర్ అధికారులను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పోస్టులను భర్తీ చేయాలి



మండలానికి రెగ్యులర్ ఎంఈఓను నియమించాలి. ఇన్‌చార్జ్‌లతో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఎంఈఓకు ఐదు మండలాల బాధ్యతలను అప్పగించడం సరికాదు. ఇష్టానుసారంగా ప్రైవేట్ పాఠశాలలు ఫీజులు వసూలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి.

– శ్రావణ్‌కుమార్, అవుసలికుంట

వైద్యం అందడం లేదు



మండలంలో కొన్ని సంవత్సరాల నుంచి పశువైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండడంతో మూగజీవాలకు సకాలంలో సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నాం. ప్రస్తుతం కింది స్థాయి సిబ్బంది వైద్యం చేస్తున్నారు. పశువైద్య శాలలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.

– వై. వెంకటస్వామి, రైతు అంబట్‌పల్లి

గోరింటాకు సంబరాలు



మెహందీని చూయిస్తున్న మహిళలు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని రక్షిత మహిళా సొసైటీ కార్యాలయం ఆవరణలో ఆదివారం ఆషాఢ మాసం గోరింటాకు సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలంతా ఒక చోట గుమిగూడి స్వయంగా గోరింటాకు మెహందీని తయారు చేసుకున్నారు. గోరింటాకు విశిష్టతను చాటి చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శైలజారెడ్డి, కౌన్సిలర్ సునితారెడ్డి, రక్షిత మహిళా సొసైటీ అధ్యక్షురాలు చేపూరి జయమ్మ, ప్రధాన కార్యదర్శి మాధవి, కోశాధికారి అంజలి, కళావతి, రాధిక, హేమలత, గిరిజ, మంజుల, జ్యోతి పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



దోమలపెంట: స్థానిక ప్రభుత్వ ప్రాజెక్టు ఉన్నత పాఠశాలలో 2004–2005 బ్యాచ్ చెందిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబవివరాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. మృతి చెందిన ఉపాధ్యాయుడు సతీష్‌కుమార్‌కు నివాళులర్పించారు. కార్యక్రమంలో దత్తు, మల్లికార్జున, సందీప తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఆపరేటర్‌కు తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: మండలంలోని పుల్జాల సబ్‌స్టేషన్‌లో మరమ్మతు చేస్తున్న ఆపరేటర్ విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన నజీర్ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

ఎన్నికల్లో మెజార్టీ తగ్గినా తీరు మారలే

నాగర్‌కర్నూల్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి మెజార్టీ సీట్లు తగ్గినా తీరు మారలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల్‌నర్సింహ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం మళ్లీ కులమత ద్వేషాలు పెంచుతోందని విమర్శించారు. ఎన్నికల్లో బుద్ధి చెప్పినా ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు కేశవులుగౌడ్, హెచ్ ఆనంద్‌జీ, ఎస్‌ఎండీ ఫాయజ్, వార్ల వెంకటయ్య, నర్సింహ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం



తెలకపల్లి: యువకుల్లో దేశభక్తికి పెంపొందించడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని పాలమూరు విభాగ కార్యవహ పత్తికొండ రాము అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని యోగా భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అకాల విపత్తు సమయంతో స్వయం సేవకులు ఎంతో ప్రాణాలు తెగించి ఎంతో మందిని రక్షించారని గుర్తు చేశారు. సనాతన ధర్మం కోసం అందరూ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. స్వయం సేవకులు, తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

కోడేరు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలైన ఘటన ఆదివారం మండలంలోని సింగాయిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాల ఇలా ఉన్నాయి రేవల్లి చెందిన రాజయ్య, అంజనమ్మ దంపతులు కలిసి పాన్‌గల్ మండలం బాలపీర్ల దగ్గరికి వెళ్తున్నారు. మార్గమధ్యలో సింగాయిపల్లికి రాగానే బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం రేవల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువకుల శ్రమదానం



తాడూరు: మండల కేంద్రంలోని ప్రధాన అంతర్గత రోడ్డు అనుసరించుకొని ఉన్న పిచ్చి మొక్కలు, కంప చెట్లను యువకులు ఆదివారం తొలగించారు. పరిసరాల చుట్టు చెత్తచెదారంతోపాటు కంపచెట్లు ఉండడం వల్ల ప్రతి రోజు పాములు తిరుగుతున్నాయని దీంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లామని యువకులు ఆంజనేయులు, జగదీశ్‌లు పేర్కొన్నారు. అధికారులు స్పందించకపోవడంతో శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రం చేసినట్లు వారు పేర్కొన్నారు. వీధీదీపాలు కూడా వెలగడం లేదని పంచాయతీ కార్యదర్శికి విన్నవిస్తే నిధులు లేవని నిర్లక్ష్యంగా సమాధనం చెప్తున్నారని వివరించారు. దాదాపు రెండు నెలలుగా వీధీ దీపాలు లేక అవస్థలు పడుతున్నా ఎంపీడీఓ స్పందించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

అందుబాటులో గడ్డి విత్తనాలు

వీపనగండ్ల: సబ్సిడీ గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల ఇన్‌చార్జి వైద్యాధికారి శ్యామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎస్‌హెచ్ 24, ఎంఎఫ్ హైబ్రిడ్ 500 కేజీలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 5 కేజీల బస్తా రాయితీ పోను రూ. 130 విక్రయించనున్నట్లు తెలిపారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ జిరాక్స్ తీసుకువచ్చి, గడ్డి విత్తనాలు తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

దోమలపెంట: స్థానిక వనమయూరీ ప్రాంతంలో మహిళలు ఈగలపెంట శివారులో కొలువుదీరిన పోలేరమ్మకు బోనాలను సమర్పించారు. అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయాన్ని మామిడి, వేప ఆకులతో అలంకరించారు. పిల్లాపాపలు ఆరోగ్యం ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



మొక్కలు నాటుతున్న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని యెన్నం ఆస్పత్రి అవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పౌరుడు పర్యావరణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. మొక్కలు నాటి రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సకాలంలో వర్షాలు కురవాలంటే చెట్లను పెంచాలని పేర్కొన్నారు. సకల జీవకోటికి ప్రాణవాయువు అందించేవి చెట్లే అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, సంజీవ్‌కుమార్ యాదవ్, సురేందర్‌రెడ్డి, డాక్టర్ యెన్నం హరికాంత్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

సేవలకు సత్కారం



కల్వకుర్తిరూరల్: వాసవీక్లబ్ ఇంటర్‌నేషనల్ ద్వార సామాజిక సేవా కార్యక్రమాలను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇంటర్‌నేషనల్ ఉపాధ్యక్షుడు జూలూరి రమేష్‌బాబు నిర్వహించారు. ఆయన సేవలను గుర్తించి ఆదివారం ఒంగోల్‌లో నిర్వహించిన వాసవీక్లబ్ ఇంటర్‌నేషనల్ సమావేశంలో ఇంటర్‌నేషనల్ ప్రెసిడెంట్ రవిచంద్రన్ రమేష్‌బాబుకు సేవాసంకల్ప్ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో ఇంటర్‌నేషనల్ అసిస్టెంట్ ట్రెజరల్ కల్వ హరికృష్ణతోపాటు పలువురు పాల్గొన్నారు.

వర్షాలు కురువాలని బంజారాలు పూజలు



లింగాల: వర్షాకాలం ప్రారంభమై నెలరోజులు గడిచినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురియక పోవడంతో రైతులు ఆందోళనలో చెందుతున్నారు. దీంతో రైతులు ఆదివారం మండల కేంద్రంలోని బంజార వాడలో ఉన్న మేరమ్మ భవాని ఆలయంలో బంజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వంటలు వండి వరుణుడికి నైవేద్యాలు సమర్పించారు. సాగు చేసిన పంటలు ఎండి పోకుండా కాపాడాలని రైతులు భగవంతుడిని వేడుకుంటున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కప్ప కావడి ఆడారు.

మైసమ్మ జాతరకు భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ జాతర ప్రాంగణం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పెబ్బేరు, నవపర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మైసమ్మ దేవతను కుటుంబసమేతంగా దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తినుబండారాలు కొనుగోలు చేశారు. భక్తుల రాకతో మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడి గంటలకొద్ది వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. ఎస్‌ఐ సతీష్ ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



కల్వకుర్తిరూరల్: మండలంలోని బెక్కెర ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఘనంగా సన్మానం చేశారు. 12 సంవత్సరాలుగా పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయుడు రఘురాం సేవలందించారు. ఆయన బదిలీతో గ్రామస్తులు కన్నీటి పర్యంతం అయ్యారు. మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, అంజలికి, శేఖర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.

ఉపాధి హామీ దిమ్మెలు ధ్వంసం



కోడేరు: గ్రామీణ ఉపాధిహామీ దిమ్మెలు దుండగులు ధ్వంసం చేసిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం ముత్తిరెడ్డిపల్లిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పంచాయతీ కార్యదర్శి మల్లేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సునీత తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో ఉపాధిహామీ పనులు పూర్తైన చోట నూతనంగా 10 దిమ్మెలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు దిమ్మెలను కూల్చివేశారని తెలిపారు. ఈ మేరకు వాటిని పరిశీలించి ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు.

సారా పట్టివేత: వ్యక్తి అరెస్ట్



పెద్దకొత్తపల్లి: మారేదిన్నెతండాకు చెందిన పాట్లావత్ నర్సింహా ద్విచక్రవాహనంపై సారా తరలిస్తున్నాడు. ఆదివారం మండలంలోని యాపట్ల క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు అతడిని పట్టుకున్నారు. 12 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు కొల్లాపూర్ ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది చెన్నగౌడ్, దస్తగిరి, వెంకటేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

సీఎం సోదరుడికి సన్మానం

చారకొండ: సీఎం రేవంత్ సోదరుడు ఎనుముల కృష్ణారెడ్డిని, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్య యాదవ్, మండలంలోని కాంగ్రెస్ నాయకులు ముజ్జుబాయి, కొండల్, జంగయ్య ఆదివారం వంగూరు మండలంలోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ ప్రాంతంలో అభివృద్ధి కమిటీ మెంబర్‌గా ఉండటంతో జూపల్లిలో పలు అభివృద్ధి పనులపై, బీటీ రోడ్ల నిర్మాణాలపై నివేదించారు. త్వరలో అభివృద్ధికి సంబంధిత పనులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఈ సందర్భంగా కృష్ణారెడ్డి పేర్కొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



పెద్దకొత్తపల్లిలో వేడుకల్లో పాల్గొన్న నాయకులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఆ సంఘం నాయకులు నర్సింహ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను జిల్లా నాయకులు రాములు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ సంఘాన్ని స్థాపించి 30 సంవత్సరాలు అయ్యిందని పేర్కొన్నారు. అదేవిధంగా మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని నిర్వహించారు. నరహరి, రమేష్, కృష్ణయ్య పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సోట కాశీం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. నాయకులు మహేష్, సాంబయ్య, విజయ్, శ్రీరాములు, మల్లయ్య, వెంకటయ్య, రాజగోపాల్, బాలరాజు, కొండల్ పాల్గొన్నారు.

ఊర్కొండ: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గుడిగానిపల్లి రాజు మాదిగ, మండల అధ్యక్షుడు రాధాకృష్ణ, మాజీ సర్పంచ్ కొమ్ము రాజయ్య, కొమ్ము శ్రీను, మంగలి గోపి, సందీప్, దయాకర్, బంగారం, పరశురాములు, వంశీ, మాదిగ విద్యార్థి సంఘం రవి, పరుశురాం, శ్రీశైలం, హరీఫ్, మాధవులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో దండోరా 30వ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ మాదిగ జన్మాదిన్నాని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

విద్యార్థినికి ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తిరూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని ఆదిలక్ష్మి ఇంటర్ ఫస్టియర్‌లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించింది. ఆదివారం సిల్వర్ జూబ్లిహిల్స్ ఆవరణలో క్లబ్ అధ్యక్షుడు చింతరల వెంకటరమణారెడ్డి, కార్యదర్శి బృంగి విజేందర్‌లు రూ.10 వేల సమకూర్చారు. ఈ మేరకు ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణలు ఆదిలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో బాలాజీసింగ్, ఆనంద్‌కుమార్, సదానందంగౌడ్, మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డు పనులు పరిశీలన



కల్వకుర్తిరూరల్: మండలంలోని కురుమిద్దతోపాటు ఇతర గ్రామాలకు వెళ్లే తిరుపతి హైవే రోడ్డు నిర్మాణం పనులను ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పరిశీలించారు. ఈ రోడ్డు మార్గంలో అండర్‌పాస్ బ్రిడ్జి లేక ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని లేని పక్షంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంట జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్‌లు శేఖర్, దామోదర్‌గౌడ్, ఆనంద్, రవి, విజయభాస్కర్, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.